సంపుటి :04 | సంచిక :88 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

శుక్రవారం 8, మే 2026

వెల ₹5

## ఫారెస్ట్ ఆఫీసులో ఏసీబీ సోదాలు

- రూ.3.50 లక్షలు లంచం తీసుకుంటూ చిక్కిన ఎఫ్డీఓ, డీఆర్ఓ

03





## బల్దియా ప్రత్యేక అధికారిగా కలెక్టర్

- పాలకవర్గ పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వ నిర్ణయం
- బాధ్యతలు చేపట్టిన వెంటనే అధికారులతో సమీక్ష
- అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు.. పారదర్శకత ఉండాలని ఆదేశం

02

## ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

02



# పొలిటికల్ హీట్


### పోటాపోటీ సభలు.. ముఖ్య నేతల సెటైర్ల వర్షం

రాష్ట్రంలో రాజకీయ సెగలు ముదురుతున్నాయి. ప్రధాన పార్టీల మధ్య మాటల యుద్ధం కాస్తా క్షేత్రస్థాయిలో దాడులకు దారితీస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య 'సంగ్రామం' నడుస్తుండగా, మరోవైపు కరీంనగర్ వేదికగా బీజేపీ-బీఆర్ఎస్ శ్రేణుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలు రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపాయి. ఒకరిపై ఒకరు విసురుకుంటున్న సవాళ్లు, వ్యక్తిగత దూషణలు చివరకు పోలీస్ కేసులు, కార్యాలయాల ధ్వంసం వరకు వెళ్లాయి. హనుమకొండ వేదికగా కేటీఆర్ పై కేసు నమోదు కావడం, కరీంనగర్ లో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై దాడి యత్నం రాజకీయ వాతావరణాన్ని ఒక్కసారిగా వేడెక్కించాయి.

– అక్షరదర్బార్, వరంగల్

- కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య 'సంగ్రామం'
- ప్రజాక్షేత్రంలో మాటల తూటాలు.. క్షేత్రస్థాయిలో ఉద్రిక్తతలు
- కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఫిర్యాదుతో కేటీఆర్ పై కేసు నమోదు
- బీఆర్ఎస్, బీజేపీ మధ్య దాడుల వరకు చేరిన వివాదాలు
- ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై దాడికి యత్నించిన బీజేపీ కార్యకర్తలు
- కౌశిక్ రెడ్డి కారు, గంగుల క్యాంప్ ఆఫీస్ లోని ఫర్నిచర్ ధ్వంసం

03






## రైతు ఆదాయం పెంచడమే లక్ష్యం

02

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- హనుమకొండలో ముగిసిన రాష్ట్రస్థాయి 'మెగా రైతు మేళా'
- సేంద్రియ సాగు, ఆయిల్ పామ్ వైపు రైతులు దృష్టి సారించాలి.. మంత్రి సురేఖ

రాష్ట్రంలో రైతు భవిష్యత్తుకు కొత్త దిశను చూపేలా, రైతు సంక్షేమమే కాకుండా వారి ఆదాయం పెంచే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో మూడు రోజుల పాటు సాగిన 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' రాష్ట్రస్థాయి మెగా రైతు మేళా గురువారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ ముఖ్య అతిథులుగా హాజరై పలు స్టాళ్లను సందర్శించారు. సదస్సులో మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో యాంత్రీకరణ, అధునాతన పద్ధతులు అవసరమన్నారు.

– అక్షరదర్బార్ , హనుమకొండ

www.aksharadarbar.com
అక్షర దర్బార్
Voice of the People



# విధుల్లో నిర్లక్ష్యం

- అధికారులు, సిబ్బందికి షోకాజ్ నోటీసులు
- డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

అక్షరదర్బార్, గంగారం: వైద్య సేవల నిర్వహణలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలో నిర్లక్ష్యం జరిగినట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవిరాథోడ్ గురువారం గంగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో విధులు సక్రమంగా నిర్వహించని స్థానిక వైద్యులు, సంబంధిత సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, విధుల పట్ల నిర్లక్ష్యాన్ని సహించబోమని డీఎంహెచ్ఓ స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో సమయ పాలన, రోగులకు మర్యాదపూర్వక సేవలు, మందుల లభ్యత, పరిశుభ్రత వంటి అంశాల్లో ఎటువంటి అలసత్వం ఉండరాదని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని హెచ్చరించారు. విధి నిర్వహణలో అలక్ష్యం చేసిన సిబ్బందిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# రైతు ఆదాయం పెంచడమే లక్ష్యం

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- హనుమకొండలో ముగిసిన రాష్ట్రస్థాయి 'మెగా రైతు మేళా'
- సేంద్రియ సాగు, ఆయిల్ పామ్ వైపు రైతులు దృష్టి సారించాలి : మంత్రి సురేఖ

అక్షరదర్బార్ , హనుమకొండ: రాష్ట్రంలో రైతు భవిష్యత్తుకు కొత్త దిశను చూపేలా, రైతు సంక్షేమమే కాకుండా వారి ఆదాయం పెంచే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో మూడు రోజుల పాటు సాగిన 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' రాష్ట్రస్థాయి మెగా రైతు మేళా గురువారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ ముఖ్య అతిథులుగా హాజరై పలు స్టాళ్లను సందర్శించారు. సదస్సులో మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో యాంత్రీకరణ, అధునాతన పద్ధతులు అవసరమన్నారు. భూసారాన్ని కాపాడుకోవడంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. దేశంలోనే మొక్కజొన్న కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ" అని ఆయన ప్రకటించారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా స్థిరమైన ఆదాయం లభిస్తుందని, రైతులు పంట మార్పిడి వైపు మళ్లాలని కోరారు.




### కల్తీ లేని సమాజం కోసం సేంద్రియ సాగు..

**మంత్రి సురేఖ**

అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఆహార పదార్థాల్లో కల్తీ పెరిగిపోతున్న తరుణంలో సహజ, సేంద్రియ వ్యవసాయం ఆవశ్యకత పెరిగిందన్నారు. రైతులు అంతర పంటల సాగు ద్వారా లాభాలు గడించాలని, ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

### రైతు మేళాకు స్పందన

ఈ మేళాలో ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ శాఖల స్టాళ్లు రైతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రైతులు ప్రతిరోజూ హాజరై ఆధునిక యంత్ర పరికరాలు, సాగు పద్ధతులపై శాస్త్రవేత్తలతో చర్చించారు. అనంతరం ఆదర్శ రైతులకు, ఆయిల్ పామ్ సాగులో అధిక దిగుబడి సాధించిన వారికి మంత్రుల చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేసి, సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, డాక్టర్ సత్యశారద, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

అక్షరదర్బార్, చిల్పూర్: బాధితులు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన గురువారం వెస్ట్ జోన్ పరిధిలోని చిల్పూర్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. చిల్పూర్ పోలీస్ స్టేషన్ కు చేరుకున్న సీపీకి అధికారులు మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ రిసెప్షన్, ఐటీ సిబ్బంది, ఇతర పోలీస్ సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకోవడంతో పాటు స్టేషన్ నిర్వహణకు సంబంధించిన రికార్డులు, రౌడీ షీటర్లు, అనుమానితుల రికార్డులు, ప్రస్తుతం పెండింగ్ కేసుల రికార్డ్ లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది సమస్యలను అడిగి తెలుకున్నారు. చివరగా సీపీ మాట్లాడుతూ ప్రతి కానిస్టేబుల్ గ్రామాలను సందర్శించి శాంతి భద్రతలకు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు, ప్రతి గ్రామస్తుడు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించే విధంగా ట్రాఫిక్ రూల్స్ పై అవగహన కల్పించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, అక్రమ ఇసుక రవాణా, పాఠశాలల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని అన్నారు. ఈ తనిఖీల్లో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ భీంశర్మ, సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ నవీన్ కుమార్ ఉన్నారు.



# బల్దియా ప్రత్యేక అధికారిగా కలెక్టర్

- పాలక వర్గ పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వ నిర్ణయం
- బాధ్యతలు చేపట్టిన వెంటనే అధికారులతో సమీక్ష
- అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు.. పారదర్శకత ఉండాలని ఆదేశం

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ మహా నగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) ప్రత్యేక అధికారిగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. బల్దియా పాలక వర్గ పదవీ కాలం మే 6వ తేదీతో ముగియడంతో, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆమె ఈ బాధ్యతలను చేపట్టారు. గురువారం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయానికి చేరుకున్న కలెక్టర్‌కు అదనపు కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు ఘనంగా స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ వివిధ విభాగాల అధికారులతో కీలక సమావేశం నిర్వహించారు. నగరంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ముఖ్యంగా రూ.100 కోట్ల విలువైన భారీ ప్రాజెక్టుల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రతిపాదన దశలో ఉన్న



ప్రాజెక్టులకు త్వరగా టెండర్లు పూర్తి చేసి, పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు.

### ప్రజా ఫిర్యాదులకు తక్షణం పరిష్కారం

టౌన్ ప్లానింగ్ విభాగంలో ఫైళ్లు పెండింగ్‌లో ఉండకూడదని, ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులపై అధికారులు తక్షణం స్పందించాలని కలెక్టర్ సూచించారు. రహదారులు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతుల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. యూజీడీ ప్రాజెక్ట్ డీపీఆర్ అంతిమ దశకు చేరుకున్నందున, ఇంజనీరింగ్ అధికారులు తగిన సూచనలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, సీఎంహెచ్ఓ డా రాజారెడ్డి, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, సమ్మయ్య, ఎంహెచ్ఓ డా రాజేష్, ఈఈలు రవికుమార్, సంతోష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులు అందుబాటులో ఉండాలి

- ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

గంగారం పీహెచ్‌సీ, అమనగల్ కొనుగోలు కేంద్రాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

అక్షర దర్బార్, మహబూబాబాద్: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. బుధవారం గంగారం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె, మందుల నిల్వలు మరియు రోగులకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని, మాతా శిశు మరణాల నివారణకు కృషి చేయాలని సూచించారు. అనంతరం మహబూబాబాద్ మండలం అమనగల్, పర్వతగిరిలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. అకాల వర్షాల ముప్పు ఉన్నందున టార్పాలిన్లు సిద్ధంగా ఉంచాలన్నారు.

# పొలిటికల్ హీట్



పోటాపోటీ సభలు.. ముఖ్య నేతల సెటైర్ల వర్షం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య 'సంగ్రామం'

ప్రజాక్షేత్రంలో మాటల తూటాలు.. క్షేత్రస్థాయిలో ఉద్రిక్తతలు

- కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఫిర్యాదుతో కేటీఆర్ పై కేసు నమోదు
- బీఆర్ఎస్, బీజేపీ మధ్య దాడుల వరకు చేరిన వివాదాలు
- ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై దాడికి యత్నించిన బీజేపీ కార్యకర్తలు
- కౌశిక్ రెడ్డి కారు, గంగుల క్యాంప్ ఆఫీస్ లోని ఫర్నిచర్ ధ్వంసం




అక్షరదర్బార్, వరంగల్ : ఇటీవలి కాలంగా ప్రధాన రాజకీయ పార్టీల నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తుంది. ఒక పార్టీ నేతలు మరో పార్టీ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. రాజకీయంగానే కాకుండా వ్యక్తిగతంగానూ విమర్శలకు దిగుతున్నారు. ఈ క్రమంలో పోటాపోటీ సభలు, ప్రెస్ మీట్ లు నిర్వహిస్తున్నారు. సవాల్ ప్రతి సవాల్ విసురుతున్నారు. అనుచిత వ్యాఖ్యలు చేయడంలో పోటీ పడుతున్నారు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ ముఖ్య నేతల నడుమ విమర్శల వార్ రోజురోజుకి పెరిగిపోతుంది. తాజాగా కాంగ్రెస్ నేతల ఫిర్యాదుతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పై హన్మకొండ సుబేదారి పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదే సమయంలో గురువారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో బీజేపీ, బీఆర్ఎస్ నేతల మధ్య వివాదం తలెత్తింది. కేంద్ర మంత్రి బండి సంజయ్ పై తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేయటాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై బీజేపీ కార్యకర్తలు దాడికి యత్నించారు. ఆయన కారును ధ్వంసం చేయడంతో పాటు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంలోని ఫర్నిచర్, సామాగ్రిని ధ్వంసం చేశారు. రణరంగంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో రంగంలోకి దిగిన పోలీసులు బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలను చెదరగొట్టారు. ఈ ఘటనను బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా ఖండించారు. దీనిపై బీజేపీ నేతలు కూడా స్పందించారు. ఇది రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం లేపింది. ఈ వరుస పరిణామాలతో పొలిటికల్ వాతావరణం ఒక్కసారిగా హీటెక్కింది.

**- పోటీ బహిరంగ సభలు**

కొద్ది రోజుల నుంచి పోటాపోటీగా బీఆర్ఎస్, కాంగ్రెస్ బహిరంగ సభలు జరుగుతుండటం సర్వత్రా చర్చనీయాంశమైంది. గత ఏప్రిల్ 20న కరీంనగర్ జిల్లా జగిత్యాలలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగ సభ జరిగితే అదే రోజు భూపాలపల్లి జిల్లా కాటారం వద్ద ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి బహిరంగ సభ జరిగింది. ఒకే రోజు ఒకే సమయంలో ఈ వేర్వేరు సభలు జరగటం గమనార్హం. మాజీ మంత్రి జీవన్ రెడ్డి తమ పార్టీలో చేరికను పురస్కరించుకుని తాము జగిత్యాల వద్ద కేసీఆర్ సభ నిర్వహించ తలపెట్టగా అదే రోజు పోటీగా కాంగ్రెస్ పార్టీ కాటారం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభ నిర్వహించిందని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆయా పార్టీ నేతలు ఒకరిపై ఒకరు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. తాజాగా బీఆర్ఎస్ హనుమకొండలో బుధవారం రైతు సంగ్రామ సదస్సు నిర్వహించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ సదస్సుకు హాజరయ్యారు. ఈ క్రమంలో హనుమకొండలో ప్రభుత్వం ఈనెల 5 నుంచి 7 వరకు రాష్ట్రస్థాయి మెగా రైతు మేళా నిర్వహించింది. మంగళవారం రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, సీతక్కతో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరై మెగా రైతు మేళాను ప్రారంభించారు. గురువారం మేళా ముగింపు కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కొండ సురేఖతోపాటు ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అయితే తమ పార్టీ ఇక్కడ రైతు సంగ్రామ సదస్సుకు నిర్ణయించడంతో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రస్థాయి మెగా రైతు మేళా నిర్వహించిందని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. అయితే రైతు సంగ్రామ సదస్సులో కేటీఆర్ తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు తదితరులు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు హనుమకొండ సుబేదారి పోలీసులు కేటీఆర్ పై కేసు నమోదు చేశారు. రైతు సంగ్రామ సదస్సు, మెగా రైతు మేళా నిర్వహణతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య విమర్శల జోరు మరింత పెరిగింది.

# ఫారెస్ట్ ఆఫీసులో ఏసీబీ సోదాలు

### రూ.3.50 లక్షలు లంచం తీసుకుంటూ చిక్కిన ఎఫ్డీఓ, డీఆర్ఓ



అక్షరదర్బార్, భద్రాచలం: అడవిని కాపాడాల్సిన అధికారులే అవినీతికి తెరలేపారు. కేసుల పేరుతో బెదిరిస్తూ అందినకాడికి దండుకుంటున్న అటవీశాఖ అధికారుల ఆగడాలకు ఏసీబీ బ్రేక్ వేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీ స్థాయిలో లంచం తీసుకుంటూ భద్రాచలం ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ (ఎఫ్డీఓ), చర్ల డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ (డీఆర్వో) ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళితే.. చర్ల మండలం పూసగుప్పలో రోడ్డు పనులు జరుగుతున్న సమయంలో కొన్ని చెట్లు ధ్వంసమయ్యాయి. ఈ విషయంలో కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేయకుండా ఉండాలంటే రూ.10 లక్షలు సమర్పించుకోవాలని భద్రాచలం ఎఫ్డీఓ సుజాత, చర్ల డీఆర్ఓ కృష్ణయ్య డిమాండ్ చేశారు. చివరకు రూ.6.50 లక్షలకు ఒప్పందం కుదిరింది.

**- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ**

అధికారులు అడిగిన లంచం ఇవ్వడం ఇష్టం లేని కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించారు. ఈ క్రమంలో గురువారం తన కార్యాలయంలో కాంట్రాక్టర్ నుండి మొదటి విడతగా రూ.3.50 లక్షల నగదు తీసుకుంటుండగా, ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేశారు. ఎఫ్డీఓ సుజాత, డీఆర్ఓ కృష్ణయ్యలను నగదుతో సహా పట్టుకున్నారు. అధికారుల చేతులకు కెమికల్ పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ రావడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు.

**పునరావృతమైన పాపం**

ఎఫ్డీఓ సుజాత అవినీతికి పాల్పడటం ఇది మొదటిసారి కాకపోవడం గమనార్హం. గతంలో కూడా ఆమె రూ.3 లక్షల లంచం తీసుకుంటూ ఒకసారి పట్టుబడ్డారు. పాత చరిత్ర ఉన్నప్పటికీ మళ్లీ అదే తరహాలో భారీ వసూళ్లకు పాల్పడటం అటవీశాఖ వర్గాల్లో కలకలం రేపుతోంది. ప్రస్తుతం ఏసీబీ అధికారులు భద్రాచలం, చర్ల కార్యాలయాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు.



## మోదీ సభను విజయవంతం చేద్దాం

- బీజేపీ పట్టణ అధ్యక్షుడు నిరంజన్
- పరకాలలో ముమ్మరంగా శక్తికేంద్ర సమావేశాలు
- బూత్ స్థాయి నుంచి తరలిరావాలని పిలుపు

అక్షరదర్బార్, పరకాల: ఈనెల 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ పిలుపునిచ్చారు. గురువారం పరకాలలోని రాజుపేట, సీతారాంపురంలో శక్తికేంద్ర సమావేశాలు నిర్వహించి సభ ఏర్పాట్లపై చర్చించారు. ప్రతి బూత్ నుండి మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సభకు వెళ్లే వారి కోసం రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నామని, ప్రతి వార్డుకు ఒక ఇంచార్జ్‌ను నియమించామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బెజ్జంకి పూర్ణచారి, ఆకుల లావణ్య, ప్రధాన కార్యదర్శి సంఘ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



## మే 12న 'అసెంబ్లీ టైగర్' ఓంకార్ శతజయంతి ముగింపు సభ

- నర్సంపేటలో భారీ ఏర్పాట్లు..జయప్రదం చేయాలని పిలుపు

అక్షర దర్బార్, నర్సంపేట: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ శతజయంతి వార్షికో త్సవ ముగింపు సభను జయప్రదం చేయాలని ఎం సి పి ఐ (యు) డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజా సాహెబ్ పిలుపునిచ్చారు. ఈ నెల 12న నర్సంపేట లోని సిటిజన్ క్లబ్ ఆవరణలో ఈ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి చట్టసభలను పోరాట వేదికలుగా మలిచిన ఘనత ఓంకార్ ది అని ఆయన కొనియాడారు. కుల వ్యవస్థ నిర్మూలనకు, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా నేతలు కన్నం వెంకన్న, నాగల్లి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## గీత కార్మికులకు వరం.. 'కాటమయ్య రక్షణ కవచం'

- నడికూడలో గీత కార్మికులకు శిక్షణ, కిట్ల పంపిణీ

అక్షర దర్బార్, పరకాల: గీత వృత్తిలో జరిగే ప్రమాదాలను నివారించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'కాటమయ్య రక్షణ కవచం'పై నడికూడ మండలం ధర్మారంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ గీత కార్మికులకు ఈ రక్షణ కవచాన్ని ఎలా ఉప యోగించాలో వివరించి, కిట్లను పంపిణీ చేశారు. తాటి, ఈత చెట్లు ఎక్కే సమయంలో ప్రాణాపాయం కలగకుండా ఈ పరికరం ఎంతగానో తోడ్పడుతుం దని ఆయన తెలిపారు. ప్రతి కార్మికుడు ఈ కవచాన్ని ధరించి తమ ప్రాణాలను రక్షించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నేతలు ఆముదాలపెల్లి మల్లేశం గౌడ్, పోశాల అశోక్ గౌడ్ మరియు బీసీ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.



## ఏకలవ్య పాఠశాలల్లో 11వ తరగతి ప్రవేశాలు

అక్షర దర్బార్, మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లాలోని ఐదు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియం 11వ తరగతి ప్రవేశాలకు దరఖా స్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయ కర్త రత్నకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 15వ తేదీలోపు సీరోలు నోడల్ కేంద్రంలో లేదా తమకు సమీ పంలోని ఏకలవ్య పాఠశాలల్లో దరఖాస్తు చేసు కోవాలి. సీరోలు, కురవి, గూడూరు, బయ్యారం పాఠశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉండగా, కొత్తగూడ పాఠశా లలో అదనంగా హెచ్ఈసీ, జాగ్రఫీ గ్రూపులు కూడా ఉన్నాయి. పదవ తరగతి మార్కుల ప్రతిభ ఆధారంగా ఎంపిక ప్రక్రియ జరుగుతుందని, ఇందులో సీబీఎస్ఈ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని ఆమె స్పష్టం చేశారు.





## కట్టెలు తెంచుకున్న మక్క రైతు ఆగ్రహం

- పంటకు నిప్పు! నల్లబెల్లిలో రాస్తారోకో
- కిలోమీటర్ల మేర నిలిచిన ట్రాఫిక్
- నెలకు పైగా నిరీక్షణ..పట్టించుకోని అధికారులు

అక్షర దర్బార్, నల్లబెల్లి: ఆరుగాలం కష్టపడి పండించిన పంట అమ్ముడుపోక, అప్పుల బాధ తాళలేక వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల రైతన్నలు రోడ్డెక్కారు. నెల రోజులుగా కొనుగోలు కేంద్రాల వద్ద నిరీక్షిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ఆగ్రహం చెందిన రైతులు.. తమ పంటకు తామే నిప్పు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. నల్లబెల్లి ప్రధాన రహదా రిపై ట్రాక్టర్లు అడ్డం పెట్టి రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం రైతుల్ని మరింత అప్పుల ఊబిలోకి నెడు తోందని వామపక్ష నాయకులు విమర్శించారు. రంగంలోకి దిగిన తహశీల్దార్ ఉప్పు కృష్ణ, సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. అనంతరం ఎస్సై సాయి ప్రసన్న కుమార్ ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

## 10న మోదీ సభను విజయవంతం చేద్దాం

- గోగుల రాణా ప్రతాప్ రెడ్డి
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌కు తరలిరావాలని పిలుపు
- కాంగ్రెస్ వంచనకు వ్యతిరేకంగా గళం ఎత్తుదాం
- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి



అక్షర దర్బార్, నర్సంపేట: ఈనెల 10న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న భారతీయ జనతా పార్టీ భారీ బహిరంగ సభకు నర్సంపేట నియోజకవర్గం నుండి ప్రజలు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని వరంగల్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి పిలుపుని చ్చారు. గురువారం నర్సంపేటలో ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలం గాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో మహిళలు, నిరుద్యోగులు, రైతులను వంచించిందని విమర్శించారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించిన కాంగ్రెస్ విధానాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు అమిత్ షా వంటి అగ్రనేతలు పాల్గొనే ఈ సభ తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వడ్డేపల్లి నరసింహ రాములు, జిల్లా ఉపాధ్యక్షులు రేసు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మక్కల కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- పీఏసీఎస్ చైర్మన్ మహిపాల్ రెడ్డి
- దుగ్గొండి మండలంలో కొనుగోలు కేంద్రాల సందర్శన
- రైతులకు ఇబ్బంది కలగకుండా లారీల ఏర్పాటు



అక్షర దర్బార్, దుగ్గొండి: కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉన్న మొక్కజొన్నలను త్వరితగతిన కొనుగోలు చేయాలని మహమ్మదాపురం పీఏసీఎస్ చైర్మన్ ఊరటి మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైకోర్టు తీర్పు మేరకు మహమ్మదా పురం సొసైటీ చైర్మన్‌గా గురువారం ఆయన తిరిగి బాధ్యతలు చేపట్టారు. అనంతరం వెంకటాపురం, గిర్నిబావిలలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. నిల్వ ఉన్న పంటను తరలించేందుకు మార్క్‌ఫెడ్ అధికారు లతో మాట్లాడి వెంటనే లారీలను తెప్పించారు. ట్రాన్స్‌పోర్ట్ విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని, పూర్తి పంట కొనుగోలు చేసే వరకు రైతులకు అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో రమేష్, డైరెక్టర్లు సతీష్ బాబు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# మృతురాలు కొమురమ్మ కుటుంబానికి బీఆర్ఎస్ నేతల పరామర్శ

అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండల కేంద్రం రాంనగర్ కాలనీకి చెందిన ఆరెపల్లి కొమురమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, యూత్ అధ్యక్షుడు తౌటం నవీన్ మృతురాలి నివాసానికి వెళ్లి ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బుర్ర శ్రీధర్ గౌడ్, నాయకులు ఆరెపల్లి సమ్మయ్య, కట్కూరి కుమార్, సారయ్య, మేడిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నైన్‌పాకలో విషాదం

# ట్రాక్టర్ ఢీకొని వ్యవసాయ కూలి మృతి

- చెట్టు కింద సేదతీరుతుండగా దూసుకెళ్లిన మృత్యువు



అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండలం నైన్‌పాక శివారులో గురువారం జరిగిన ప్రమాదంలో జడల్‌పేట గ్రామానికి చెందిన జినుకల శ్రీనివాస్ (52) దుర్మరణం పాలయ్యారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. శ్రీనివాస్ కూలి పని నిమిత్తం పొలానికి వెళ్లారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో సమీపంలోని ఒక చెట్టు కింద విశ్రాంతి తీసుకుంటున్నారు. అదే సమయంలో నైనపాకకు చెందిన ఒక రైతు తన ట్రాక్టర్ ద్వారా పత్తి చెట్లను తొలగిస్తుండగా, అది అదుపుతప్పి నిద్రిస్తున్న శ్రీనివాస్‌పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రీనివాస్ మృతితో జడల్‌పేటలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

# రోడ్ల నిర్మాణమే లక్ష్యం

- మరిపల్లెలో సీసీ రోడ్డు ప్రారంభం

అక్షర దర్బార్, దుగ్గొండి: గ్రామాల్లోని అంతర్గత రహదారులను అభివృద్ధి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని మర్రిపల్లి సర్పంచ్ డ్యాగం సుజాత సుధాకర్ అన్నారు. గురువారం మండలంలోని మరిపల్లె గ్రామంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల కింద మంజూరైన రూ. 3 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు కుంట రాజుకుమార్, ఉప సర్పంచ్ బోయిని రంజిత్, వార్డు సభ్యులు మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# తాగినోడికి తడిసి మోపెడు

- ఐదుగురికి కోర్టు జరిమానా
- మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే
- మేజిస్ట్రేట్ హెచ్చరిక



అక్షర దర్బార్, శాయంపేట: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వ్యక్తులకు, బహిరంగ ప్రదేశాల్లో న్యూసెన్స్ చేసిన వారికి పరకాల కోర్టు భారీ జరిమానా విధించింది. శాయంపేట ఎస్సై పరమేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన పిట్టల యుగేందర్, ఆలేటి ప్రవీణ్, లోది పుష్పేందర్, బొంద శ్రీనులకు కలిపి రూ. 4,600 జరిమానా విధించారు. అలాగే అర్ధరాత్రి రోడ్లపై తాగుతూ గొడవ చేసిన మారపెల్లి రఘు వర్మకు రూ. 1,000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా మేజిస్ట్రేట్ శ్రీవల్లి శైలజ స్పందిస్తూ.. మరోసారి మద్యం తాగి వాహనాలు నడిపినా, బహిరంగంగా న్యూసెన్స్ చేసినా కఠినంగా వ్యవహరిస్తామని, జైలుకు పంపుతామని హెచ్చరించారు.

# ముగిసిన రేణుక ఎల్లమ్మ వేడుకలు

- చిట్యాలలో 'బోనాల' సందడి
- అంగరంగ వైభవంగా అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్న భక్తులు



అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండల కేంద్రంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న శ్రీ రేణుక ఎల్లమ్మ ఐదవ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా ముగిశాయి. గౌడ సంఘం మండల అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో చివరి రోజున భక్తులు పెద్ద ఎత్తున బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య ఎల్లమ్మ తల్లికి మొక్కులు సమర్పించుకున్నారు. పాడిపంటలు చల్లగా ఉండాలని, గీత వృత్తి లాభదాయకంగా సాగాలని కోరుకున్నారు. ఐదు రోజుల పాటు నిర్వహించిన హోమాలు, ప్రత్యేక పూజలు, గావు పట్టే కార్యక్రమాలతో ఉత్సవాలు ముగిశాయని నిర్వాహకులు తెలిపారు.

# చిట్యాలలో 'స్వీయ గణన'కు శ్రీకారం

- ఆన్‌లైన్‌లో కుటుంబ వివరాల నమోదు
- సొంతంగా ఎలా నింపాలో అవగాహన కల్పించిన ఏఎంసీ చైర్మన్



అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండల కేంద్రంలో సెన్సస్ సెల్ఫ్ ఎనిమరేషన్ (స్వీయ గణన) కార్యక్రమాన్ని సర్పంచ్ తౌటమ్ లక్ష్మీ అంతయ్య గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి తన మొబైల్ ద్వారా కుటుంబ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రక్రియను పూర్తి చేశారు. అనంతరం ప్రజలు తమ ఫోన్లలో సొంతంగా వివరాలను ఎలా నమోదు చేసుకోవాలో ప్రత్యక్షంగా వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు 'అనిత' భరోసా

- ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయాన్నే పనులకు రావాలని ఏపీవో సూచన
- పత్తిపాకలో పనుల పరిశీలన.. ఫీల్డ్ అసిస్టెంట్‌కు ప్రశంసలు



అక్షర దర్బార్, శాయంపేట: మండలంలోని పత్తిపాక గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీవో కె. అనిత పరిశీలించారు. కూలీల హాజరును స్వయంగా తనిఖీ చేసిన ఆమె, ఎండ తీవ్రత పెరుగుతున్నందున ఉదయం 6 గంటలకే పనులకు హాజరై, త్వరగా పనులు ముగించుకోవాలని సూచించారు. పత్తిపాకలో ప్రతిరోజూ 300 మందికి పైగా కూలీలు రావడం హర్షణీయమని, ఇదే స్ఫూర్తితో కూలీల సంఖ్య 500 దాటితే గ్రామానికి మరో అవార్డు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ కుమారస్వామి పనితీరును ఆమె అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గజ్జి ఐలయ్య, కార్యదర్శి రాజారాం పాల్గొన్నారు.

# రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు

- మెరుగైన సాగుపై అవగాహన

అక్షర దర్బార్, శాయంపేట: రానున్న వానాకాలం సీజన్‌లో మెరుగైన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు నేరెడుపల్లిలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. వరంగల్ వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డా. టి. శ్రీజయ మాట్లాడుతూ.. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలని, పంట వ్యర్థాలను కాల్చకుండా భూమిలో కలియదున్నాలని సూచించారు. ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని, ఆయిల్ పామ్ సాగులో లాభాలు ఉన్నాయని డా. వంశీ కృష్ణ వివరించారు. భూసార పరీక్షల ఆధారంగానే ఎరువులు వాడాలని అధికారులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఈవో సానియా, సర్పంచ్ మడికొండ ఇందిర తదితరులు పాల్గొన్నారు.